
సత్యజీవనము



అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2001



నీ జీవితం సుఖంగా, సార్థకంగా ఉండాలంటే చిత్త శుద్ధి, వినమ్రత, గట్టి పట్టుదల, యోగంలో ముందుకు పోవాలనే తపన చాలా ముఖ్యమైన విషయాలు. అన్నింటికీమించి, పురోగతికి పరిమితులు లేవనే గట్టి విశ్వాసం తప్పనిసరి. పురోగతే యౌవనం. నూరేళ్ళు వయస్సు వచ్చినా కూడా యౌవనంగా జీవించవచ్చు!

*

నీకన్నా మహోన్నతమైన, సువిశాలమైన దాని కోసం నీ జీవితాన్ని అంకితం చేసుకుంటే, గడిచిపోతున్న సంవత్సరాలు భారం అనిపించవు.

*

నీ లక్ష్య సాధనలో శరీరం విఫలం కాకూడదని నీవు అభిలషిస్తే, అనవసరమైన ఆవేదనతో నీ శక్తిని వృథా చేసుకోకూడదు. నీవు ఏ పని చేసినా సరే, దానిని ప్రశాంతమైన సుస్థిరమైన చిత్తంతో చెయ్యి. శాంతి, నైశ్చల్యములలోనే మహత్తర శక్తి ఉంది!

శ్రీమాత



మనిషి ఏ క్షణంలో అడుగు ముందుకు వేయకుండా ఆగిపోతాడో అప్పుడు పతనమవుతాడు. ఏ క్షణంలో సంతృప్తి చెంది, ఆకాంక్షించడం మానుకుంటాడో, అప్పుడే మరణించడం మొదలుపెడతాడు! జీవితమంటే ఊరికే కాలక్షేపం చెయ్యటం కాదు. జీవితమంటే కదలిక, ప్రయత్నం, పురోగమనం, పర్వతాన్ని అధిరోహించడం, వినూత్న దర్శనాలవైపు ఆరోహణ, భవిష్యత్ సిద్ధుల వైపు ప్రస్థానం. విశ్రాంతి కావాలనే నెపంతో నిర్వ్యాపారంగా కూర్చోని ఉండటం చాలా ప్రమాదం! కర్మాచరణలోనే, ప్రయత్నంలోనే, ముందుకు పురోగమించడంలోనే నీకు విశ్రాంతి లభిస్తుంది. భగవంతుని కృపాకటాక్షాలలో సంపూర్ణ విశ్వాసం ఉంచడం లోనే నిజమైన విశ్రాంతి పొందాలి. కోరికలు లేకపోవడంలోనే విశ్రాంతి పొందాలి. అహంకారంపై విజయం పొందడంలోనే విశ్రాంతి పొందాలి.

చైతన్యం విస్తరించడంలోనే, చైతన్యం విశ్వీకరణంలోనే నిజమైన విశ్రాంతి లభిస్తుంది. ఈ ప్రపంచమంత విశాలంగా నువ్వు ఎదుగుతే, నీకు నిరంతరం విశ్రాంతి లభిస్తుంది. ఎంతటి కఠినమైన కర్మాచరణలోనైనా సరే, యుద్ధరంగం నడిబొడ్డులోనైనా సరే నీవు చేసే ప్రగాఢ ప్రయత్నంలోనే శాశ్వతత్వపు, అనంతత్వపు స్థిరత్వాన్ని నీవు పొందగలవు.

శ్రీమాత

రెండు భావాలు ... బహుళవ్యాప్తిని చెందాయి, ముఖ్యంగా పాశ్చాత్య ప్రపంచంలో. ఒకటి – జీవిత ప్రధాన లక్ష్యం సుఖము. రెండవది– ప్రతి మనిషీ కొన్ని ప్రత్యేక లక్షణాలతో జన్మిస్తాడు. దానిని మార్చడం అసంభవం.

మొదటి భావం ఒక ప్రగాఢమైన సత్యం యొక్క వికృతరూపం. సృష్టి యావత్తూ సచ్చిదానందంపై ఆధారపడి ఉంటుంది. ఈ ఆనందమే లేకపోతే జీవితమే లేదు. ఈ ఆనందం దైవత్వపు లక్షణం. దాని తత్త్వం. అందువల్ల పరిస్థితులపై ఆధారపడదు. మామూలుగా ఈ ఆనందాన్ని బాహ్యపరిస్థితులపై ఆధారపడే లౌకిక సుఖాలతో పోల్చకూడదు! ఆనందంగా బ్రతకడానికి అందరికీ హక్కు ఉంది అన్న వాదన ఎవరి జీవితం వారే జీవించాలన్న న్యాయానికి దారి తీస్తుంది. ఈ మనోవైఖరి అస్పష్టమైన, దుందుడుకు అహంకారంతో కలిసి, అన్ని రకాల సంఘర్షణలు, ఆవేదనలు, నైరాశ్యం, అధైర్యం వైపూ, తరుచుగా మహోపద్రవానికికూడా దారి తీస్తుంది....

ఇక రెండవ భావం - అవచేతనపై దాదాపు సంపూర్ణ ఆధిపత్యం సాధిస్తేనే గాని, అచేతన నుండి వచ్చిన పోకడల పట్ల కఠినమైన క్రమశిక్షణ, సంయమనం ఉంటేనే గాని, మానవ లక్షణంలో మౌలికమైన మార్పు రాదన్న సిద్ధాంతం ద్వారా ఏర్పడుతుంది. మామూలు మానవ స్వభావాలలో ఈ అచేతన, సంస్కారాల ద్వారా (atavism) ఒక వ్యక్తి జన్మించిన పరిసరాల ద్వారా అభివ్యక్తమవుతుంది.... అయినప్పటికి ఈ మార్పును *(fundamental change of character)* సిద్ధింప చేసుకోవడం సాధ్యమే. విస్పష్ట దృక్పథం గల క్రమశిక్షణ, సంయమనం ద్వారా, పట్టుదల ద్వారా మానవ లక్షణాల పరివర్తనను నిజానికి సాధించడం జరిగింది. ఎప్పటి కప్పుడు జరిగే వైఫల్యాలు కూడా నిరాశపరచ లేని మొండి పట్టుదల చాలా అవసరం.

పరివర్తన చెందించ వలసిన మానవ తత్త్వం పట్ల సర్వ సమగ్రమైన, విశ్లేషణాత్మకమైన పరిశీలన అనివార్యమైన ప్రారంభదశ.

శ్రీమాత

క్షుద్రత్వాన్ని, సంకుచితత్వాన్ని, అల్పత్వాన్ని నీలోంచి బహిష్కరించు. అతివిశాలమైన దిఙ్మండలాలకన్నా వైభవంగా, అత్యున్నత హిమశిఖరంకన్నా ఠీవిగా ఫరిఢవిల్లు. అత్యంత ప్రగాఢమైన మహాసాగరాలకన్నా గంభీరంగా జీవించు.

శ్రీఅరవిందులు



నీకు నా ప్రేమ, కరుణ, ఆశీస్సులు.

కాని అవి నీకు అనుభూతిలోకి రావాలంటే, నీవు సంయమనంతో ఉండాలి. శ్రద్ధ, ఏకాగ్రత ఉండి తీరాలి. అన్నింటినీ మించి నీ కోరికలకు, సరదాలకు స్వస్తి చెప్పాలి. అవి చెప్పినట్లు వినకూడదు.

మనిషికి జీవితంలో కోరికల పుట్టతో క్రమశిక్షణ లేని నిరర్థకమైన జీవితం కావాలో లేక ఆకాంక్ష జ్వాలలో అధిరోహిస్తూ, నిమ్న ప్రకృతిపై ఆధిపత్యం వహించే క్రాంతిజీవితం కావాలో – ఈ రెండింటిలో ఒక దానిని నిర్ణయించుకుని తీరాలి.


*

సుఖం కోసం జీవించ వద్దు. భగవంతునికి సేవ చేయడానికే జీవించు. అప్పుడు నీకు లభించే ఆనందం నీవు ఊహించిన దాని కన్నా వెయ్యిరెట్లు ఎక్కువగా ఉంటుంది

*


భగవత్ కారుణ్యము, మానుషీ చాపల్యము – ఈ రెండింటి మధ్య తీసుకోవలసిన నిర్ణయం నీ జీవితంలో ప్రతిక్షణం ఎదురవుతూనే ఉంటుంది.

శ్రీమాత



అత్యున్నతమైన నిగూఢ రహస్యాన్ని అభివ్యక్తం చేస్తూ భగవద్గీతలోని ఆఖరి మహోత్కృష్ట ప్రవచనం రెండు సంక్షిప్త, ప్రత్యక్ష తేలిక శ్లోకాలలో చెప్పబడింది. ఎటువంటి తదుపరి వ్యాఖ్యానం లేకుండా, విపులీకరణం లేకుండా మనస్సులోకి అవి చొచ్చుకొనిపోయి, ఆత్మ అనుభవక్రమంలో వాటి అర్థం, పరమార్థాల పూర్ణత్వాన్ని అవే సమావిష్కృతం చేసేటట్లు వాటిని వదిలి వేయడం జరిగింది.... ఇదిగో రహస్యాలలో కెల్ల ఉత్తమ రహస్యం, ఈశ్వరుని మహోన్నతమైనఅత్యంత ప్రత్యక్ష సందేశం.... ఇదిగో – "నా యందు మనస్సుగల వాడవు కమ్ము. నా ప్రేమికునిగా, నా ఆరాధకునిగా ఉండు. సర్వస్వం నా కోసం త్యాగం చెయ్యి. నాకు శిరస్సు వంచి మ్రొక్కు.... నీవు నా వద్దకు వస్తావు. ఇది నా ప్రతిజ్ఞ, నీకు నా వాగ్దానం. ఎందుకంటే నీవు నాకు ప్రియమైన వాడివి. సర్వధర్మాలను పరిత్యజించు. నన్ను మాత్రమే శరణు వేడుకో. సర్వపాపాలు, అశుభాల నుండి నిన్ను నేను విముక్తుణ్ణి చేస్తాను. విచారించకు".

శ్రీఅరవిందులు



తానెటువంటి వాడైనప్పటికీ, అతనిలో ఎంతటి అజ్ఞానం, అపోహలు, అహంకారం, నిరసనలు, తిరుగుబాటులు ఉన్నప్పటికీ, ప్రతి వ్యక్తినీ అతి దగ్గర మార్గాల ద్వారా తన దివ్య లక్ష్యం వైపు నడిపే పరాత్పరుని పరమాద్భుతమైన కరుణను ఎప్పుడూ విస్మరించరాదు. అదే మనం చూపే కృతజ్ఞత.

సర్వ అహంకారాన్ని, అస్పష్టతను ద్రవీభూతం చేసే విధంగా మన హృదయాలలో నిత్యం పవిత్ర కృతజ్ఞతా జ్వాల నును వెచ్చగా, తీయగా, జాజ్వలమానంగా ప్రజ్వరిల్లాలి. సాధకుణ్ణి అతని లక్ష్యం వైపు నడిపే పరాత్పరుని కారుణ్యం కోసం వెలిగే కృతజ్ఞతా జ్వాల అది. అతను మరింతగా కృతజ్ఞత చూపి, భగవంతుని కారుణ్య ప్రభావాన్ని గుర్తించి, అందుకు కృతజ్ఞతలు తెలుపుకొన్నపుడు, లక్ష్యానికి మార్గం మరింత చేరువ అవుతుంది.

*

కృతజ్ఞత: మూసుకున్న ద్వారాలను తెరచి మమ్మల్ని పరిరక్షించే కారుణ్యాన్ని లోలోపలికి, చొచ్చుకొని పోయేటట్లు నీవు చేయగలవు.

శ్రీమాత



నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరం వెలుగు, ఆనందం, ప్రేమ సంభరితంగా ఆయురారోగ్యాలతో, శుభప్రదంగా, ప్రయోజనాత్మకంగా సాగాలని ఆశీర్వదిస్తూ –

శ్రీమాత

*

"భగవంతుని కరుణ ఎప్పటికీ విఫలం కాదు" అనే విశ్వాసాన్ని మన హృదయాలలో నిరంతరం నిలుపుకోవాలి.

ఆశీస్సులు

శ్రీమాత

అనువాదం. కె. యజ్ఞన్న

Publishers: Sri Aurobindo Society, Pondicherry - 605001, Editor: R.L.N. Sastry
Printers Sri Aurobindo Ashram Press, Pondicherry - 605001.
Registered with the Department of Posts, No: TN/PMG(NR)-39/2000
Licensed to post at the concessional rate of postage
at Sri Aurobindo Ashram P.O. on 2nd, 3rd and 4th of every month.